# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-02-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లో 2047 నాటికి పేదరిక నిర్మూలనే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **తెలంగాణలో ఏడు నగరపాలక సంస్థల మేయర్లు, ఉప మేయర్లు, 116 పురపాలక ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు ఈ రోజు జరుగుతాయి.**

3. **స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.**

4. **టీ-20 ప్రపంచ కప్‌లో భాగంగా జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై 61 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది.**

==========================

ఆంధ్రప్రదేశ్ లో 2047 నాటికి పేదరిక నిర్మూలనే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శివరాత్రి సందర్భంగా గుంటూరు జిల్లా నంబూరులో ఒక ప్రయివేట్ టీవీ ఛానెల్ నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆలయాలకు ప్రసిద్ధి అని జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఉన్న శ్రీశైలంతో పాటు పంచారామాలు, శ్రీకాళహస్తి, లేపాక్షి, మహానంది, శ్రీముఖలింగం పుణ్యక్షేత్రాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. సంపద సృష్టి ద్వారా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30 సెకన్లు

--------------------------

మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్ గేట్స్ ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో సమావేశమవుతారు. 'స్వర్ణాంధ్ర విజన్-2047' లక్ష్యాల సాధనకు చేపట్టిన సంస్కరణలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య, మెడ్‌టెక్, సంజీవని వంటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి బిల్ గేట్స్‌కు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. అలాగే 'సంజీవని' ప్రాజెక్టు పనితీరును ప్రత్యేకంగా వివరించనున్నారు. అనంతరం, బిల్ గేట్స్ బృందం అమరావతిలోని ఉండవల్లి సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తుంది. అక్కడ డ్రోన్లు, ఏఐ సాంకేతికత సహాయంతో చేపడుతున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిశీలించనుంది.

---------------------------

తెలంగాణలో ఏడు నగరపాలక సంస్థల మేయర్లు, ఉప మేయర్లు, 116 పురపాలికల ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు ఈరోజు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఈ ఎన్నికల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్లతోపాటు ఎక్స్‌అఫీషియో సభ్యులు పాల్గొనాలని ఆదేశించిది. పారదర్శకత కోసం ఎన్నికల ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలని సూచించింది. మొదట మేయర్, ఛైర్‌పర్సన్ ఎన్నిక పూర్తయిన తర్వాత వైస్ ఛైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ ఎన్నికను చేపట్టాలని సూచించింది. చేతులెత్తి ఆమోదం తెలిపే విధానంలో మేయర్, ఉపమేయర్, ఛైర్‌పర్సన్ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

---------------------------

మహాశివరాత్రి లింగోద్భవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అక్కమహాదేవి అలంకార మండపంలో రాత్రి 12.00 గంటలకు స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పల్నాడు జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర ఆలయం వద్ద ప్రభల తిరునాళ్లను నిర్వహించారు. తెలంగాణలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో లింగోద్భవ ప్రత్యేక పూజలను నిర్వహించగా, కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు, శివపార్వతుల కళ్యాణోత్సవం నిర్వహించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పాలకొల్లులో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా పూలపల్లి గ్రామంలో 15 లక్షల రూపాయలతో నిర్మించనున్న స్మశాన వాటిక అభివృద్ధి పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్. 30.. సెకన్లు

---------------------------

మహిళల సాధికారత, గ్రామీణ జీవనోపాధుల పురోగతికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం ఒక వెయ్యి 876.23 కోట్ల రూపాయలను కేటాయించినట్లు పేర్కొన్నారు. దీనదయాల్ అంత్యోదయ యోజన -- జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద 818 కోట్లు, మహిళా కిసాన్ శశక్తీకరణ కార్యక్రమం కింద 30 కోట్లు, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రాలకోసం 15 కోట్లు కేటాయించామని తెలిపారు. అలాగే రైతు ఉత్పత్తి సంస్థలను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత శక్తివంతం చేయాలని ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

---------------------------

స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నూజివీడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బడ్జెట్ అంశంపై నిన్న పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సమాన

ప్రాధాన్యత ఇస్తూ  కేటాయింపులు చేశారని, అన్ని రంగాలకు ప్రాధాన్యత లభించిందని చెప్పారు. జిల్లాల నీటి పారుదల ప్రాజెక్టులకు భారీగా నిధుల కేటాయింపు ద్వారా త్వరితగతిన ప్రాజెక్టులు పూర్తి అవుతాయని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచ కప్‌లో భాగంగా కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియం వేదికగా భారత్ - పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన గ్రూప్-ఏ క్రికెట్ మ్యాచ్ లో 61 పరుగుల తేడాతో పాకిస్తాన్ పై విజయం సాధించింది.  ఈ మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచిన పాకిస్థాన్ ముందుగా ఫీల్డింగ్ ఎంచుకోగా  తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. అనంతరం 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్  జట్టు 18 ఓవర్లలో కేవలం 114 పరుగులకు  ఆలౌటైంది. ఈ విజయంతో టీ-20 ప్రపంచ కప్‌లో భారత్ సూపర్-8కు అర్హత సాధించింది.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్ర, యానాం, రాయలసీమల్లో ఈరోజు, రేపు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. పొగమంచు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించారు.  ఉత్తర కోస్తా, యానాం, రాలయసీమల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల సెంట్రిగ్రేడ్ వరకూ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

---------------------------

అమెరికాతో వాణిజ్య  ఒప్పందంపై కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రైతులు, ఎగుమతిదారుల్లో అనవసర భయాందోళనలు కలిగించేలా ఉన్నాయని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు.  ఆయనది దుష్ప్రచారమని  ప్రజలు  దాన్ని అంగీకరించరని  సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రస్తుతం భారత్  4 లక్షల కోట్ల రూపాయల  విలువైన వస్త్రాలను ఎగుమతి చేస్తోందని 38 దేశాల పరిధిలో 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల  ద్వారా 45 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ మార్కెట్‌కు ఇప్పుడు అవకాశాలు ఏర్పడ్డాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అభివృద్ధి చేస్తున్న 7 మెగా జౌళి పార్కుల్లో తెలంగాణలోని వరంగల్ కాకతీయ టెక్స్‌టైల్ పార్కు కూడా ఉందని దీని వల్ల తెలంగాణకు భారీ లబ్ధి చేకూరనుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

=====================